# అబద్ధాల గోడ

"ఆడది అబద్ధంవాఁడితే గోడ కట్టినట్టుంటుంది" అన్నాడో హరిశ్చం ద్రుడు. నాకు కొంచెం నవ్వు, కించిత్ కోపవూఁ వచ్చేయి. అబద్ధాలాడ్డం అంటే అదేం స్నానవాఁడ్డం, నీళ్ళాడ్డం లాంటిది కాదు, అంత సుళువూ కాదు.

మొన్న సాయంత్రం-కాంపౌండులో చెట్లమీద పిట్టల సందడేతప్ప, యింట్లో పిల్లల చప్పుడు లేదు. పక్కవాడి ఊపిరి వినిపించేటంత నిశ్శబ్దంగా ఉంది ఇల్లు. అప్పుడే కోర్టు నుంచి వచ్చారు మావారు. ఓకె, షాట్ ముందు డైరెక్టరు సెట్టంతా కలయచూసినట్టు ఇంటినీ నన్నూ ఒకే చూపుతో సర్వే చేశారు. చేసి "నీ సంతానం అంతా ఏవయ్యేరు?" అన్నారు. ఆయన పసికట్టడంలో అల్సేషియన్‌కి అన్న.

మొగపిల్ల లిద్దరూ సినిమాకి వెళ్ళేరు. నాతో చెప్పేవెళ్ళేరు. ఆమాత్రం పదిరోజులకోసారైనా వాళ్ళనలా వదలకపోతే వాళ్ళకి ఇల్లు జైలు అయిపోతుంది. నిజానికి మా పిల్లలు మిగిలినవాళ్ళతో పోలిస్తే బృహస్పతులే. నాకు తెలీకుండా ఏపని చెయ్యరు. కాని మా హిరణ్యకశిపులవారికి ఇవేం అర్థంకావు. జడ్జీ అవడం వల్లో లేక అతని మెంటాలిటీనే అంతో తెలీదు కాని అతనికళ్ళకి అందరూ ముద్దాయిల్లాగే కనిపిస్తారు.

ఇప్పుడు కాని వాళ్ళు సినిమాకి వెళ్ళేరని చెప్తే "వాళ్లనలా రోజూ సినిమాలకి పంపించి ధ్వంసం చేసేస్తున్నావు. పిల్లలు యింట్లోంచి పోతే చాలని చూస్తావు. ఎంతసేపూ నీ రాతలు, నీ సరదాలే తప్ప పిల్లల సంగతి పట్టించుకోవడం నీకు చేతకాదు. అసలిలాంటి వాళ్ళకి దేఁవుఁడు పిల్లల్ని ఎందుకిస్తాడో..." అంటూ అతనిచ్చే లెక్చరు వాళ్లు సినిమా నుంచి తిరిగి వచ్చినా ఆగదు.

అంచేత టు సేవ్ మైస్కిన్ "చిన్ని ఎవరో ఫ్రెండింటికి నోట్సు కోసం వెళ్లేడు అరుణ పెరట్లోనో ఎక్కడో వుంటాడు" అన్న అబద్ధం చెప్పక తప్పలేదు.

"మిగతా వాళ్లు?"

ఆయన కొన్నేళ్ళు లీడింగ్ లాయరు. తరువాత జడ్జి. అందుచేత క్రాస్ ఎగ్జామినేషను అలవాటై పోయింది.

ఆడపిల్ల లిద్దరూ ఫ్రెండింటికి వెళ్ళేరు. నాతో చెప్పే వెళ్ళేరు. నేనెప్పుడూ వాళ్ళని ఎన్నిగంటల కొస్తారు? ఆడఫ్రెండా? మొగఫ్రెండా? వగైరా ప్రశ్నలడగను. తమ మంచిచెడ్డలు నిర్ణయించుకునే వయసు. ఆలోచించుకునే శక్తి వున్నాయి వాళ్ళకి. అంచేత "చీకటి పడకుండా రండి" అని మాత్రం చెప్పాను. ఒక వయసొచ్చేక పిల్లల్ని చాలావరకు వదిలెయ్యాలి. ఒకవేళ మనం తెలివితక్కువగా పట్టుకున్నా వాళ్ళు పారిపోతారు. అన్నిటికీ ఆరాలుతీస్తే మిగిలేది ఆరాటమే, కాని మా హిట్లరుకి ఇవేవీ అర్థం కావు.

"ఆడపిల్లలు ఫ్రెండింటికి వెళ్ళేరు" అనిగాని నేను చెప్తే "అహ" అని ఊరుకునే రకం కాదు.

"అర్ధరాత్రివరకు ఆడపిల్లల్ని తిరగనిచ్చిన తల్లిని నిన్నే చూశాను–నేను తెలుగు గ్రాడ్యుయేట్‌నే అయినా, సాయంత్రం ఆరు గంటలని అర్ధరాత్రి అంటారని నేనెక్కడా చదవలేదు. అఫ్‌కోర్సు నువ్వు చాలా సివిలైజుడు లేడీవి నేనేదో చాదస్తపు చవటని. నీ లెవెల్ అందుకోలేను. కాని నా పిల్లల్ని మాత్రం నాలెవెల్లోనే పెంచు...ఛీ.ఛీ. నాఖర్మ కొద్దీ నేను కట్టుకున్నాను. వాళ్ళు దరిద్రంకొద్దీ నీకడుపున పుట్టేరు. నీ పెంపకంతో వాళ్ళ ఫ్యూచర్ తల్లుకుంటే...

మై హార్ట్ బ్లీడ్స్...యీ ధోరణిలో వాళ్ళు వచ్చి భోంచేసి పడుకున్నా వదలరు.

అదంతా తప్పాలంటే నేనేం చెప్పాలి? "కాలేజిలో ఏదో ఫంక్షనుందిట పిల్లలంతా కలిసి సరదాగా వెళ్లేరు" అని, అదే చెప్పేను.

ఒక్కోసారి నా అబద్ధాలకి నాకే చికాకొస్తుంది.

"పోనీ మీ నాన్నతో ఓమాట చెప్పి పోకూడదుట్రా" అంటే వాళ్ళు ముందు కెవ్వున కేకేస్తారు తరువాత "అమ్మ! బాబోయ్ అంతకంటె

యింట్లో కూర్చోవడం నయం. "ఏం సినిమా? టిక్కెట్లు దొరుకుతాయా? అట్నుంచి ఒంటరిగా రాగలరా? సైకిలుకి లైటుందా? టైర్లో గాలుందా? బ్రేకులు సరిగ్గా ఉన్నాయా? పరీక్ష లెప్పుడు? క్రితం సినిమా చూసి ఎన్నాళ్ళైంది. మీ అమ్మ వెళ్ళమందా?" అంటూ ప్రశ్నలు అంతకంటె యూనివర్శిటీ పేపరు తేలిగ్గా వుంటుంది. నీకు అలవాటైపోయింది. మా అమ్మవికదూ వచ్చే జన్మకక్కూడా నీకడుపునే పుడతాం..." అంటూ బతిమాలి పారిపోతారు.

వాళ్ళని చూస్తే జాలి. వాళ్ళ తండ్రిని తల్చుకుంటే వణుకు.

ఇంతకీ నా మాటలు అతను నమ్ముతారన్న నమ్మకం నాకు లేదు.

"ఈ వేణ్ణీళ్ళెవరికి?" అన్న బాత్రూములోంచి వచ్చిన గావుకేకకి స్టవ్‌మీది కాఫీ పొంగిపోయింది. మేకునున్న చేట కిందపడి పోయింది గట్టుమీది బక్కెట్టు నూతిలోకి గెంతేసింది –

చన్నీళ్ళ స్నానం ఆరోగ్యానికిమంచిదట...ఎవరూ కాదనం.

అన్ని కాలాల్లోను. అన్ని వేళల్లోను చన్నీళ్ళే స్నానం చేస్తారు అతను ఐస్‌తో స్నానం చేసినా మాకేం అభ్యంతరం లేదు.

కాని, ఇంట్లో ఎవరూ వేణ్ణీళ్ళలో వేలు కూడా పెట్టడానికి వీల్లేదని ఆర్డరేసేరు. (నేను మాత్రం చచ్చిన్నాడే చన్నీళ్ళ స్నానం – అదైనా నేను పోసుకోను కాబట్టి.)

తన ఆర్డరుకు తిరుగులేదని ఆయన నమ్మకం. అయితే అందరం గాస్ స్టౌమీదే గిన్నెవేసి నీళ్ళు కాచుకొని స్నానం చేస్తున్నావన్న నిజం చెప్పి ఆయన నమ్మకాన్ని పాడుచెయ్యడం మా కెవరికీ ఇష్టం లేదు. దొంగస్నానం చేసినవాళ్ళు జాగ్రత్తగా వుండొద్దూ? ఇప్పుడాన్ ది స్పాట్ అబద్ధం కావాలి.

"మేజుకి నీళ్లు పోద్దామని నేనే పెట్టేను. నాకేమి ఇంతవరకు పని తీరలేదు. అదేమో కాంపౌండులో ఎక్కడో తిరుగుతోంది" అన్నాను కాఫీ అందిస్తూ. ఒక్కోసారి నా తెలివికి నాకే ఆశ్చర్యం వేస్తుంది.

నామాట పూర్తికాకుండానే వచ్చింది మేజుతోక ఊపుకుంటూ. నా అదృష్టం కొద్దీ అది నిజంగానే మాసిపోయింది.

"నువ్వు పిల్లలే కాకుండా కుక్కని కూడా పాడుచెయ్యకు. డిసిప్లేన్ మనిషికీ కుక్కకి ఒకటే. మంచి అలవాట్లు నువ్వెలాగూ మప్పలేవుకాని,

నేను చచ్చిచెడి చేసినవి మాత్రం చెడగొట్టకు...కమాన్, లెటజ్ హేవ్ ఎ బాత్" అంటూ దాన్ని గొ ర గొ రా యీడ్చుకుపోయేరు– "కుయ్యోకుయ్యో" మని అది, "రేపు పోద్దాంలెస్తురూ" అని నేను అరుస్తున్నా వినకుండా.

ఆరాత్రి మావారు చూడకుండా దానికి "సారీ" చెప్తే కాని అది అలకమాని అన్నం తినలేదు. కథంతా విన్న పిల్లలు కూడా దానికి "సారీ" చెప్పడవేఁకాకుండా. దానికొక ఇంగ్లీషు సినిమా ప్రామిస్ చేశారు. ఇంకెప్పుడూ నేను ఇలాంటివి అనని హామీ ఇచ్చేవరకు అది మామూలు కుక్క అవలేదు.

ఇంతకీ –

ఆడది అబద్ధాల గోడకట్టినా, నిజాలమేడ కట్టినా, కేవలం సంసారంలో శాంతిభద్రతల కోసమేఁ. అబద్ధమే పాపమైతే మా పాపాలన్నీ మొగుళ్ళకే.

*('ఆంధ్రజ్యోతి' దినపత్రిక 15–4–1978.)*

★ ★ ★